ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 25 జూలై 2024



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడండి : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 24 :గోదావరి పరివాహక ప్రాంత మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చద లవాడ నాగరాణి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఫ్లడ్ ప్రత్యేక అధికారి, ఈపీడీసీఎల్ విశాఖపట్నం జనరల్ మేనేజర్, ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో మావేశమై గోదావరి వరద, విద్యుత్ చర్యలపై సమీక్షించారు. వరద పోటు కారణంగా పరివాహక ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అవసరమైన మెటీరియల్, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఫ్లడ్ ప్రత్యేక అధికారి రామ్మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

వీడని ముంపు..



తాడేపల్లిగూడెం మండలం నందమూరులో చెరువులను తలపిస్తున్న పంటపొలాలు

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నెమ్మదిగా తగ్గు తోంది. బుధవారం ఉదయం 7 గంటలకు 47.3 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సాయంత్రానికి నెమ్మదిగా తగ్గి 6 గంటలకు 45.2 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం నిలకడగా గోదారి నీటి మట్టం ఉంది. అయితే ప్రాణహిత ఉపనది ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాత్రికి మళ్ళీ గోదా వరి నీటిమట్టం పెరగనున్నట్టు సమాచారం. దిగువకు వరద జలాలను విడుదల చేస్తుండడంతో వశిష్ట నది తీర ప్రాంతాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. ఎర్రకాల్వ శాంతించినా కాల్వల్లో నీరు లాగక పోవడంతో వరి చేలు ఇంకా ముంపులోనే ఉన్నాయి..



కనకాయలంక కాజ్‌వే వద్ద చిన్నారిని స్కూల్‌కు తీసుకెళుతున్న తండ్రి

ఎర్రకాల్వ పరిధిలో చెరువుల్లా వరిచేలు

తగ్గిన వయ్యేరు వరద

తణుకు, జూలై 24 : దువ్వ వయ్యేరు కాలువ వరద తగ్గుముఖం పట్టింది. దువ్వ అక్విడెక్టు వద్ద నీటి ప్రమాదం 18 అడుగులు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 13 అడుగులు నీటిమట్టం కొనసాగుతోంది. వరద ఉధృతి తగ్గినప్పటికీ పొలాలు ఇప్పటికి నీటిలోనే ఉన్నాయి. తణుకు మండలంలోని ముద్దాపురం, కోనాల, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లో వరిచేలను ఎర్రకాలువ వరదనీరు నిండాముంచింది. మండపాక, దువ్వ గ్రామాల్లో నాట్లు వేసిన చేలు పూర్తిగా నీటిలోనే ఉండటంతో కుళ్లిపోయాయని కొత్తగా నాట్లు వేసుకోవాలని రైతులు వాపోతున్నారు. దువ్వ మాచారమ్మ ఆలయం, దళితపేట, తూర్పుగూడెం ప్రాంతాల్లో నివాస ప్రాంతాలు వరద నీటిలోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయి పారిశుధ్య పనులు చేస్తున్నారు. వయ్యేరు కాలువ ఉధృతి తగ్గుముఖం పడితేనే ఇక్కడ నీరు లాగుతుందని గ్రామస్థులు చెబుతున్నారు.

లంక గ్రామాలను వీడని వరద

ఆచంట /యలమంచిలి/ నరసాపురం, జూలై 24: భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టినప్పటికి బుధవారం కూడా కోడేరు వద్ద గోదావరి ఉధృతంగానే ప్రవహిస్తున్నది. దీంతో మండలంలోని అయోధ్యలంక, పెదమల్లం లంక, కోడేరు లంకలో పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. గోదావరి ప్రవాహం వల్ల లంక గ్రామాలతో రాకపోకలు స్థంభించిపోయాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరింది. ఆలయ ఆవరణంలో కూడా వరద నీరు చేరింది. గోదావరి శాంతించాలని కోరుతూ పలువురు మహిళలు గోదావరికి పూజలు చేశారు. పశువులకు పశు గ్రాసం లేదని ప్రభుత్వం స్పందించి పశు గ్రాసాన్ని తక్షణం సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. తహసీల్దార్ ఐవిశెట్టి, ఎంపీడీవో నరసింహప్రసాద్, వీఆర్‌వోలు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



అయోధ్యలంకలో వరదనీటిలో గ్రామస్థుల అవస్థలు

లంకల్లో పడవలపైనే రాకపోకలు

గోదావరి వరద బుధవారం మరింత పెరిగింది. కనకాయ లంక గ్రామస్థులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాల్లోని పల్లిపాలెం ప్రాంతాల్లో ఇళ్లచుట్టూ చేరిన వరదనీరు బుధవారం మరింత పెరిగింది. ఏనుగువానిలంక నుంచి బాడవ వెళ్లే ప్రధానరహదారిపై వరదనీరు చేరింది. కనకాయలంక, పెదలంక, యలమంచిలి లంక, బాడవ గ్రామాల్లో పల్లపుప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుతుండటంతో గురువారం సాయంత్రానికి ఇక్కడా వరద తగ్గే అవకాశం ఉందని లంకగ్రామాల ప్రజలు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కనకాయలంక, లక్ష్మీపాలెం, దొడ్డిపట్ల, బాడవ, వడ్డిలంక స్లూయిజ్ వద్ద వరద పరిస్థితిని తహసీల్దార్ విజయశ్రీ పరిశీలించారు.

వశిష్టకు పోటెత్తుతున్న వరద నీరు

ఎగువ నుంచి లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టడంతో నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం తగ్గలేదు. ప్రవాహం పెరగడంతో బుధవారం పాలకొల్లు రోడ్ ఇసుక ర్యాంపు నీట మునిగింది. అన్ని రేవుల వద్ద నీటి మట్టాలు యాధావిధిగా కొనసాగుతున్నాయి నాల్గో రోజు కూడా ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాకపోకల్ని నిలిపివేశారు. పట్టణంలోని ఐదు తూములు, ధర్భరేవు, పీచుపాలెం, ఈస్ట్ కొక్కిలేరు తలుపుల వద్ద లీకేజీలను ఇసుక బస్తాలతో అరికట్టారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆర్డీవో అంబరీష్, తహసీల్దార్ ప్రసాద్, ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావులు పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సాయంత్రానికి నీటమట్టం తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు కొత్త నవ రసపురం ఎస్టీ కాలనీలో ప్రజలకు ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపు సిద్ధం చేశారు. పొన్నపల్లిలో వరద వస్తే నీటిని తోడేందుకు భారీ మోటార్లు ఏర్పాటు చేశారు.

437 ఎకరాల్లో కూరగాయ పంటలు నాశనం

ఆచంట : లంకగ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునిగాయి. ఆచంట మండలంలో 234 ఎకరాలు, యలమంచిలి మండలంలో 104 ఎకరాలు, పెనుగొండ మండలంలో 98 ఎకరాల్లో కూరగాయలు, తమలపాకు, అరటి, బెండ, వంగ, పచ్చిమిర్చి వంటి తోటలు నీట మునిగాయి. వరద వల్ల ప్రస్తుతం పలు రకాల కూరగాయల పంటలు నీట మునిగినట్లు ఉద్యాన వన శాఖాధికారి ప్రియదర్శిని తెలిపారు.



పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద వరద నీరు



గోదావరి శాంతించాలంటూ పూజలు



అయోధ్యలంకలో నీట మునిగిన కూరగాయల పంటలు



పోలవరంలో బుధవారం సాయంత్రానికి స్వల్పంగా వరద తగ్గింది. నీటి మట్టం 24.267 మీటర్లకు చేరుకుంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 45.50 మీటర్లకు చేరుకోవడంతో దిగువకు ప్రవహించి స్పిల్ వేలోకి వస్తున్న వరద జలాలు 11,82,837 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు..

రైతుల కోసం వైఎస్ ప్రారంభించిన జలయజ్ఞం కార్యక్రమానికి జగన్ సమాధి కట్టారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం ఎర్ర కాలువ వరదకు నీటమునిగిన తాడేపల్లిగూడెం మండలం నందమూరు ప్రాంతంలో ఆమె పర్యటించారు. పంట చేల వద్దకు బురదలో నడిచి వెళ్లారు. రైతులు ఆమెకు కుళ్లిన వరినారు చూపించి తమ గోడు వెళ్లబోసుకున్నారు.. -7లో..





మునిగిన చేలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

స్వలకాలిక రకాలు వేసుకోండి

ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ

పెనుమంట్ర, జూలై 24 : ఎడతెరిపి లేని వర్షాలకు, ఎగువ నుంచి వస్తున్న భారీ వరద వల్ల జిల్లాలో 40 వేల 031 ఎకరాల్లో వరిచేలు, 1,595 హెక్టార్లలో నారుమడి ముంపునకు గురైందని ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. ముంపు ప్రాంతాల్లో బుధ వారం శాస్త్రవేత్తలు, అధికారుల బృందం పర్యటించారు. ప్రధాన పొలం 10-40 రోజుల వయసుకలిగి, సుమారు5-6 రోజుల పాటు ముంపునకు గురైనట్లు గుర్తించామన్నారు. ప్రధానంగా స్వర్ణ, సంపద స్వర్ణ, పీఎల్ఏ 1100,పీఆర్-126 లాంటి రకాలను సాగుచేశారు. అయితే చాలా ప్రాంతాల్లో మళ్లీ నాట్లు వేయాల్సిన పరిస్థితి ఉండొచ్చని బృందం అభిప్రాయపడింది. స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1010, 1156, 1153, 1293 రకాలు లేదా పీఆర్ 126 లాంటి రకాలను నీరు లాగేసిన మెరక మళ్లను గుర్తించి నారుమడులు వేసుకోవాలని సూచించింది ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకాలు కొంతమేర మార్టేలరు పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తన అధికారి అయిన డాక్టర్ దయాళ్ ప్రసాద్‌బాబును 94909 13434 నంబర్‌లో, ఎంటీయు 1293 విత్తనం కోసం డాక్టర్ సత్యప్రియలలితను 92488 38628 నంబర్లలో సంప్రదించాలని తెపియజేశారు. ఇవి 125 రోజుల కాల పరిమితి కలిగి, చీడపీడలు తట్టుకొని సుమారు 35 బస్తాల దిగుబడిని ఇచ్చే సామర్థ్యం ఉంటాయి.పొడవు, సన్న గింజ కలిగి ఉండటం వల్ల కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులకు కూడా అనువుగా ఉంటాయని తెలిపారు. రెండు, మూడు రోజుల ముంపునకు గురై నీరు లాగేసే పొలాలలో చేను త్వరగా నిలదొక్కుకోవడానికి 20 కిలోల పొటాష్, 20 కిలోల యూరియాను వేయాలన్నారు. దీంతో పాటుగా కార్బెండిజం +మాంకోజెబ్ కలిసిన మిశ్రమం 2 గ్రాములు లేదా కార్బెండిజం 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగుళ్ల రాకుండా నివారించ వచ్చని సత్యనారాయణ తెలిపారు.



ఆక్రమణలపై పన్ను..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆక్రమణల్లో నిర్మాణాలు చేపడితే పన్నులు వేయడానికి గడచిన ఐదేళ్లలో వైసీపీ నాయకులు అడ్డంగా దోచుకున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తిపడ్డారు. తెలుగుదేశం సానుభూతి పరులవైతే కట్టడాలను కూలగొట్టారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ఇటువంటి దందాలు లెక్కకుమిక్కిలి సాగాయి. వాటన్నింటికి ఇప్పుడు చెక్ పడుతోంది. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలు ఉంటే పన్నులు వేయనున్నారు. ముఖ్యంగా విమానాశ్రయ భూములు, వీకర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు పన్నులు వేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఇదివరకే దిశానిర్దేశం చేశారు. త్వరలోనే అందరికీ పన్నులు వేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అదే జరిగితే మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుంది.

విమానాశ్రయ భూముల్లో అందరికీ వర్తింపు
ప్రభుత్వ నిర్ణయం..మున్సిపాలిటీ కసరత్తు
గత ఐదేళ్లలో అందిన కాడికి దోచుకున్న నేతలు
అండదండలు అందించిన అధికారులు

విమానాశ్రయ నివాసితులకు లబ్ధి

విమానాశ్రయ భూముల్లో ఆక్రమిత కట్టడాలు అనేకం ఉన్నాయి. కొందరికి ఉద్దేశపూర్వకంగానే నిర్మాణాలు నిలిపివేశారు. లేదంటే పన్నులు వేయకుండా ఇబ్బందులు పెడుతూ వచ్చారు. గడచిన ఐదేళ్లలో వసూళ్ల దందా సాగింది. సొమ్ములు ముట్ట చెప్పిన వారికి పన్నులు వేశారు. నిర్మాణాలకు అవకాశం కల్పించారు. లేదంటే ఇబ్బందులు పెట్టారు. ఆక్రమిత కట్టడాలకు పన్నులు వేస్తే నివాసితులకు కాస్త భరోసా ఉంటుంది. మున్సిపాలిటీకి ఆదాయమూ పెరుగుతుంది. ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తే పన్ను ఉన్నవారికే వర్తిస్తుంది. ఇప్పటిదాకా విమానాశ్రయ భూముల్లో 2,600 మంది నివాసితులకు పన్ను వేశారు. మిగిలిన వారంతా ఎదురు చూస్తున్నారు. కొత్తగా పన్నులు వేయడం లేదు.ఈ క్రమంలోనే అవినీతి చోటు చేసుకుంటుంది. పన్నులు వేని వారినుంచి ముడుపులు స్వీకరిస్తున్నారు. వాటిని చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాలు జారీచేశారు.

క్రమబద్ధీకరణ అయ్యేనా

గతంలో తెలుగుదేశం కూటమి అధికారంలో ఉన్నప్పుడు విమానాశ్రయ భూముల్లో క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. వంద గజాల లోపు నిర్మాణాలు ఉంటే ఉచితంగా ఇచ్చేలా ప్రణాళిక చేశారు. ఆపైన 500 గజాల వరకు నిర్ణీత మొత్తంలో సొమ్ములు చెల్లించేలా కసరత్తు చేశారు. అప్పట్లో 1100 మంది లబ్ధిదారులకు ఉచితంగా క్రమబద్ధీకంరించే నిబంధనలు రూపొందించారు. వంద గజాలలోపు ఉన్న వారందరినీ గుర్తించారు. ప్రభుత్వం మారిన తర్వాత సదరు ప్రతిపాదనలు మూల నపడ్డాయి. వైసీపీ హయాంలో కొత్తగా నిబంధనలు రూపొందించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. క్రమబద్ధీకరణకు కృషి జరిగితే పన్నులు తప్పనిసరి. దానికోసం గడచిన ఐదేళ్లలో అంతా దోచుకున్నారు. ఇప్పుడు పన్నులు వేసేలా ఎమ్మెల్యే ఆదేశాలివ్వడంతో ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

అయిన వారికి అందలం

గత ఐదేళ్లలో మున్సిపాలిటీలో అయినవారికి అందలమెక్కించారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు ప్రోత్సహించారు. కొత్తగా ఆక్రమణలకు అవకాశం కల్పించారు. విమానాశ్రయ భూములు, బ్రహ్మానంద మార్కెట్‌లో ఇటువంటి దందా అధికంగా సాగింది. శారదా గ్రంథాలయం పూర్తిగా అన్యాక్రాంతమై పోయింది. వైసీపీ నేతకు, అప్పటి మున్సిపల్ అధికారులకు శారదా గ్రంథాలయంలో భారీ ముడుపులు ముట్టాయి. న్యాయస్థానంలోనూ మున్సిపాలిటీ పోరాటం చేయలేదు. దాంతో ఇప్పుడా స్థలంలో అన్యాక్రాంతంలో ఉంది. మరోవైపు బ్రహ్మానంద మార్కెట్‌లో ఆక్రమణలను ప్రోత్సహించారు. వైసీపీ నేత వారసుల పేరుతో దాదాపు 200 గజాల స్థలంలో పన్నులు వేశారు. నిర్మాణం లేకుండానే పన్ను వేసి వైసీపీ నేతకు మున్సిపల్ అధికారులు అండగా నిలిచారు. ఆ స్థలం విలువ దాదాపు రూ.8 కోట్ల వరకు ఉంటుంది. అలాగే బ్రహ్మానంద మార్కెట్‌లో కొత్తగా ఆక్రమణలకు అవకాశం కల్పించారు. దాదాపు 300 గజాల స్థలం ఒక్కరే ఆక్రమించుకున్నారు. దానికి వైసీపీ నేత అండదండ లున్నాయి. సంత మార్కెట్‌కు ఆనుకుని అప్పట్లో ఆక్రమణ జరిగింది. ఇలా తమకు నచ్చిన వారికి మున్సిపల్ అధికారులు వంత పాడారు. వైసీపీ నేతల దందాకు చేయూ తనిచ్చారు. ఈసారి మాత్రం తర తమ భేదం లేకుండా విమానాశ్రయ భూముల్లో ఆక్రమణలకు పన్ను వేయాలని ప్రభుత్వ పక్షం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల నిర్మాణాలకు మాత్రమే పన్నుదారులకు హక్కు కలిగి ఉంటారు. స్థలం మాత్రం ప్రభుత్వం ఆధీనంలో ఉంటుంది. మౌలిక వసతులు కల్పించ డానికి మాత్రమే పన్ను ఉపయోగపడుతుంది.



వీసీ వస్తారా ?

అయోమయంలో ఉద్యాన వర్సిటీ.. నెల రోజులుగా ఎదురుచూపు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24: ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. నెల రోజుల క్రితం నుంచి వర్సిటీ ఉపకులపతి నియామకం చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఉప కులపతి జానకీరామ్ తన పదవికి రాజీనామా చేశారు. కొత్త వీసీ నియామకం లేక పరిపాలనా విభాగం, రీసెర్చ్ విభాగం, బోధనా విభాగాల్లో స్తబ్ధత నెలకొంది. కనీసం సిబ్బంది ప్రయాణాలకు డీజిల్ కావాలన్నా నిధులు లేని పరిస్థితి నెలకొంది. పోనీ వర్సిటీ నిల్వ నిధులు ఉపయోగిద్దామన్నా గత వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీ కార్యకలాపాలపై వచ్చిన ఆరోపణల దృష్ట్యా వాటిని ఉపయోగించే సాహసం చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదు. దీంతో కొత్త వీసీ నియామకం కోసం వర్సిటీ ఆశగా చూస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలోని చాలా విశ్వ విద్యాలయాలకు వీసీలను నియమించారు. వర్సిటీలో సీనియర్ అధ్యాపకుల వివరాలను ఇప్పటికే ప్రభుత్వం సేకరించింది. వారిలో ఎవరినైనా నియమిస్తే కేంద్రానికి సమర్పించాల్సిన యుటిలైజేషన్ సర్టిఫికెట్‌లు అందిస్తే నిధులు విడుదలకు మార్గం సుగమం అవుతుంది. మరోవైపు పరిపాలన విభాగం, రీసెర్చ్ విభాగంతో పాటు బోధనా విభాగంలో నెల రోజుల తరబడి క్లియర్ చేయాల్సిన ఫైల్స్ పేరుకు పోవడంతో వర్సిటీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

జగన్ పాలనలో జలయజ్ఞానికి సమాధి

ఎర్ర కాలువ ముంపు ప్రాంతాల్లో వైఎస్ షర్మిల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24 : జగన్ పాలనలో వైఎస్ మానస పుత్రికగా రైతుల కోసం ప్రారంభించిన జలయజ్ఞం కార్యక్రమాన్ని సమాధి కట్టారని, కనీసం పాత మంచినీటి ప్రాజెక్టులకు మరమ్మతులు కూడా చేయకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఎర్ర కాలువ ముంపు ప్రభావంతో నీటమునిగిన తాడేపల్లిగూడెం మండలం నందమూరు ప్రాంతంలో బుధవారం ఆమె పంట చేల వద్దకు బురదలో నడిచి వెళ్లారు. రైతులు ఆమెకు కుళ్లిన వరినారు చూపించేందుకు చేలో దిగితే ఆమె స్వయంగా నడుంలోతు నీళ్లలో దిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెతో గ్రామంలోని రైతులు ముంగళ్ల రత్తయ్య, గర్సుకూటి సర్వేశ్వరరావు తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఎప్పుడు వర్షాలు వచ్చినా తమ ప్రాంతాన్ని ఎర్ర కాలువ ముంచేస్తుందని గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎర్రకాలువ గట్లు పటిష్టం చేసినా గట్లకు గండ్లు పడ్డాయని.. ఆ తరువాత వచ్చిన



పంట పొలాల పరిశీలనలో భాగంగా చేల బురద గట్టుపై నడిచి వెళుతున్న వైఎస్ షర్మిల

వైసీపీ ప్రభుత్వం ఎర్రకాలువ వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే గత ఐదేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఎకరాకు రూ.12 వేల చొప్పున ఒక్కో రైతుకు లక్ష నుంచి మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల మాటలకు స్పందిస్తూ ఆమె గత వైసీపీ ప్రభుత్వం పాపాలే నేడు ప్రతిపక్షం కూడా లేకుండా చేశాయన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వమైనా వచ్చే ఏడాది నాటికి రైతులకు ఈ పరిస్థితి రాకుండా ముంపు భారి నుంచి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కష్టాల్లో ఉన్న రైతులకు నష్టపరిహారం అందించాలని, రైతుల కోసం ప్రభుత్వం ప్రకటించకపోయినా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతంలో రాజకీయాలు చేయడానికి రాలేదని రైతుల పరిస్థితి స్వయంగా చూసి ప్రభుత్వానికి తెలియచెప్పేందుకే చేలలోకి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి, జిల్లా అధ్యక్షురాలు అరిగిల అరుణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్, కామన ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అసెంబ్లీ పాయింట్..

లిక్కరు పాలసీతో జగన్ దోచుకున్నాడు..



వైసీపీ ప్రభుత్వంలో లిక్కరు పాలసీ ద్వారా జగన్ అడ్డగోలుగా వేల కోట్ల రూపాయలు దోచేశాడు. బ్లాక్ మార్కెట్ ద్వారా వైసీపీ నాయకులు లిక్కరు అమ్ముకుని కోట్ల రూపాయలు వెనకేశారు. ఈ లిక్కరు ఆదాయాన్ని చూపించి బ్యాంకులకు తాకట్టు పెట్టడమే కాకుండా ప్రజలు ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి అన్ని విధాలుగా రాష్ట్రాన్ని నాశనం చేశారు.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే, తణుకు

మద్యం ఉసురు జగన్‌కు తగులుతుంది



మద్యం అమ్మకాలపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన దురాగతాలు ఇప్పటివరకు ఎవరూ చేయలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వం మద్యంపై ఎంత ఆదాయం సంపాదించిందో అంతే ఆదాయం జగన్ కూడబెట్టుకున్నాడు. నాసిరకం మద్యం తాగి ఎంతో మంది చనిపోయారు.. ఆ కుటుంబాల ఉసురు తప్పనిసరిగా జగన్‌కు తగులుతుంది.

- బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే, తాడేపల్లిగూడెం

జగన్ తీరు.. దున్నపోతుపై వర్షం కురిసినట్టే..



జగన్ చేసిన అరాచకాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబితే దాన్ని కూడా తీసుకోకుండా ప్రభుత్వం ఏర్పడిన 45 రోజులకే రాష్ట్రపతి పాలన అంటూ ధర్నాకు దిగడం దున్నపోతుపై వర్షం పడినట్టు ఉంది. గతంలో 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని ప్రస్తుతం 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నారని, మిగిలిన 140 మందిని ఇప్పించమని కోర్టులో కేసు వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రతిపక్ష హోదా కావాలంటూ కోర్టులో కేసు వేయడం కుందేలుకు కూడా కొమ్ములు మొలుస్తాయనే అంత మూర్ఖత్వం జగన్‌కు ఉంది. గతంలో అధికారంలో ఉన్న సమయంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా 200కు పైగా కేసులు కోర్టులో వేశారని ఈ కేసు కూడా అదేవిధంగా వీగిపోతుంది.

- డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే కైకలూరు

కొత్త స్టడీ సెంటర్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 24:ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం, గుంటూరు వారు 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు కొత్త స్టడీ సెంటర్స్ పర్మిషన్‌కు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, ఎంపీఎల్, ప్రైవేటు హైస్కూల్స్, జూనియర్ కళాశాలలు దరఖాస్తు చేయుటకు వీలుగా apopen-school.ap.gov.in వెబ్‌సైట్ నందు అప్లికేషన్‌ను పొందపరచామని జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి తెలిపారు. ఇప్పటికే పర్మిషన్ పొంది ఉన్న స్టడీ సెంటర్లు కూడా రెన్యువల్స్ చేసుకోవాలని సూచిస్తూ దానికి సంబంధించిన అప్లికేషన్‌ను apopenschool.ap.gov.in ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ నందు పొందుపరిచామన్నారు. కొత్త స్టడీ సెంటర్స్ పర్మిషన్, రెన్యువల్స్ దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి రెండు ప్రతులు సమర్పించాలని డీఈవో పేర్కొన్నారు.

ఉద్యాన కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24 : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో రెండేళ్ల డిప్లమో కోర్సు పూర్తిచేసి హార్టీ సెట్-2024 దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 26న ప్రవేశ పరీక్ష ఉంటుందని హాల్‌టికెట్‌లు రాని అభ్యర్థులు తమ ఐడీకార్డులు చూపిస్తే డూప్లికేట్ హాల్ టికెట్‌లు పొంది పరీక్ష రాయవచ్చని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. హార్టీకల్చర్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తులు 25, 26 తేదీల్లో అవకాశం కల్పించామన్నారు. ఆ విద్యార్థులు ఈనెల 29, 30, 31 తేదీల్లో తమకు కావాల్సిన కళాశాల ఆప్షన్‌లు నమోదుచేసుకోవచ్చని, ఆగస్టు 3న అభ్యర్థులకు కళాశాలల కేటాయింపు ఉంటుందన్నారు. ఆ అభ్యర్థులు ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకూ వారికి కేటాయించిన కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని వివరించారు. బీఎస్సీ (హానర్స్) హార్టీకల్చర్ నాలుగేళ్ల కోర్సు ప్రవేశానికి ఏపీఈఏపీసెట్-2024 అర్హత పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సెస్ లేకుండా పొగాకు కొనుగోళ్లకు అనుమతి

కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం, జూలై 24 : అదనంగా పండించిన పొగాకుకు సెస్ లేకుండా కొనుగోలు చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చిందని కొయ్యలగూడెం పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమస్యను ఎంపీలు పురందేశ్వరి, మహేష్ యాదవ్‌లను కలిసి విన్నవించడంతో వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సెస్ లేకుండా పొగాకు అమ్ముకోవడానికి అనుమతి ఇచ్చారన్నారు. ఈమేరకు రైతులకు ఒక్కొక్కరికి రూ.50వేల వరకు లబ్ధి చేకూరనుందన్నారు. ఒక్కో బ్యారన్‌కు రైతు 35 క్వింటాళ్ళ పొగాకు పండించాల్సి ఉండగా 2024-25 సంవత్సరానికి గాను ఒక్కో బ్యారన్‌కు 41 క్వింటాళ్ళ పొగాకును పండించడానికి కేంద్రం అంగీకరించిం దన్నారు.ఈ సందర్భంగా ఎంపీలకు, బోర్డు అధికారులకు రైతు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

» మంత్రి సంధ్యారాణికి ఉపాధ్యాయుల వినతి

బుట్టాయగూడెం, జూలై 24 : ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణిని అమరావతిలో కలిసి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. నైట్ డ్యూటీ, నైట్ హాల్ట్, టర్న్ డ్యూటీల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీచేయాలని, ఐటీడీఏ పరిధిలోని ఉన్న అన్ని పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, ఐటీడీఏకు రెగ్యులర్ డీడీని నియమించాలని, అన్ని ఆశ్రమ పాఠశాలల్లో నర్సులను నియమించాలని వినతిలో కోరారు. ఉపాధ్యాయుల వినతిపై ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.రెడ్డిదొర, కె.సతీష్, కరకం శ్రీనివాస్, వెట్టి రమణ, ఏటీఏ నాయకులు చిర్రి దేవరాజు, సోదెం రాజు, తెల్లం రాములు, సరియం నాగేశ్వరావు, కె.వెంకటేశ్వరావు, ఎన్.రంగారావు, చోడెం నాగేశ్వరావు పాల్గొన్నారు.

దేశప్రగతి.. రాష్ట్రాభివృద్ధి.. బడ్జెట్ లక్ష్యమిదే

భీమవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులకు, యువతకు ప్రయోజనం, ముద్రా లోను రూ.20 లక్షలకు పెంచారు. మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేలా రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. మౌలిక వసతులకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. దీనివల్ల ఎంతో అభివృద్ధి సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో పెద్దపీట లభించింది. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి పోటీ చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రాష్ట్ర అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ప్రతీసారి చెబుతూనే ఉంది. ఇందుకు తగ్గట్టుగానే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అమరావతి రాజధానికి కేంద్ర కట్టుబడింది. ఇచ్చిన హామీని నెరవేర్చింది, రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. యువతలో నైపుణ్య అభివృద్ధి పెంచే దిశగా విద్య, ఉపాధి కోసం అనువుగా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ఆక్వా రంగానికి ఊతమిచ్చారు. మేత ధరలు తగ్గనున్నాయి. జిల్లాలో ఆక్వా రంగం విస్తరించేందుకు కేంద్ర బడ్జెట్ దోహదపడనుంది. ఆక్వా పై ఆధారపడిన జిల్లాగా పశ్చిమకు కేంద్ర బడ్జెట్‌లో ప్రోత్సహకాలు ఉపయోగపడనున్నాయి. జిల్లాలో మౌలిక వసతులు పెరగనున్నాయి. దేశప్రగతికి, రాష్ట్ర అభివృద్ధికి దోహద పడిన బడ్జెట్‌ను ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రం ప్రవేశపెట్టడం హర్షణీయం.



- కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, భీమవరం

క్రైం సమాచారం

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా బెదిరింపు

» కర్రీ పాయింట్ నిర్వాహకుడి నుంచి సొమ్ములు వసూలు చేసిన నలుగురి అరెస్టు

» నిందితుల వద్ద మీడియా నకిలీ ఐడీ కార్డులు..

ఏలూరు క్రైం, జూలై 24 :ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల మంటూ ఒక కర్రీ పాయింట్ నిర్వాహకుడిని బెదిరించి సొమ్ములు గుంజిన నలుగురిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారని ఏలూరు డీఎస్పీ ఈ. శ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీఈ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలం కొత్తూరు ఇందిరమ్మ కాలనీ మెయిన్‌రోడ్డులో మండల అప్పలనాయుడు కర్రీ పాయింటు నిర్వహిస్తున్నాడు. అతడి వద్దకు ఈనెల 22వ తేదీన ఒక మహిళ వచ్చి తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌నని కూరలలో రంగులు, కెమికల్స్ కలుపుతున్నారని ఫిర్యాదు వచ్చిందంటూ, లైసెన్సు ఉందా అంటూ బెదిరించి ఉన్నతాధికారులతో మాట్లాడాలంటూ సెల్‌ఫోన్‌ను అప్పలనాయుడుకు ఇచ్చింది. ఆ ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి అప్పలనాయుడిని బెదిరించాడు. అనంతరం అతడి వద్ద నుంచి రూ.పది వేలు తీసుకున్నారు. బాధితుడికి అనుమానం కలిగి ఈ సంఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ కె. రాజారెడ్డి వారి సిబ్బంది, హెడ్ కానిస్టేబ్ కె.సత్యారావు, కానిస్టేబుళ్ళు పి.నాగరాజు, చెన్నారావు, జి.అజయ్, మహిళా కానిస్టేబుల్ చైతన్య ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నేరానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా అవతారంతో వచ్చిన ఏలూరు రూరల్ మండలం చాటపర్రు రోడ్డుకు చెందిన



నిందితులు వినియోగిస్తున్న నకిలీ ఐడీ కార్డులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

ముంగర వెంకటదుర్గ అలియాస్ ఘంటసాల దుర్గ, ఉన్నతాధికారిగా మాట్లాడిన ఏలూరులోని హనుమాన్‌నగర్ సిక్కులగుడి ప్రాంతంలో నివాసం ఉంటున్న బుక్కిరి దేవీప్రసాద్ వీరితో పాటు ఈ నేరానికి పాల్పడిన ఏలూరు మారుతీనగర్‌కు చెందిన అగ్గాల ఉమామ హేశ్వరి, ఏలూరు తంగెళ్ళమూడి ఎమ్మార్సీ కాలనీకి చెందిన పులిగా రాంబాబు పలు న్యూస్ చానళ్ల విలేకరులుగా నకిలీ ఐడీ కార్డులను కలిగియున్నారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద ఐడీ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదుదారుడు అప్పలనాయుడిని కొంతమంది బెదిరించి మళ్లీ వారికి అనుకూలంగా వాయిస్ చెప్పించుకుని గ్రూపుల్లో పెట్టిన వారిపై విచారణ చేపట్టామని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. నిందితులను ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద అరెస్టు చేశామని వెల్లడించారు. వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్ళు, గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవరైనా మీడియా ముసుగులో కాని, ప్రభుత్వ అధికారులమని ఎవరినైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ప్రతినిధులు

'కూటమి ప్రభుత్వంతో నెరవేరనున్న ఆశలు'

తణుకు, జూలై 24 : 'రాష్ట్రంలో మెజారిటీ ఉద్యోగులు కోరుకున్నట్టుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నెరవేరతాయని నమ్మకం ఉంది' అని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం తర్వాత ఈహెచ్ఎస్ ప్రవేశపెట్టి గతంలో దశాబ్దాలుగా ఆర్టీసీ సంస్థ ద్వారా పొందే రిఫరల్ ఆసుపత్రుల వైద్య సౌకర్యాలను గత ప్రభుత్వ హయాంలో తొలగించినందున.. ఉద్యోగుల ఇబ్బందుల దృష్ట్యా పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేత ఎం.డి.ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండి. ఎ.ఆలీ, విజయవాడ జోన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌రావు, వై.శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ప్రసాదు, జిల్లా కార్యదర్శిగా అల్లం సత్యనారాయణ, వర్కింగ్ అధ్యక్షుడిగా ఎంఎస్. బాబు, కోశాధికారిగా రవికుమార్‌తో పాటు ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

31లోపు పదోన్నతుల అభ్యంతరాలు తెలపండి

ఏలూరుటూటౌన్, జూలై 24: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు నగర పాలక సంస్థ, ఏడు పురపాలక పాఠశాలల్లో పని చేయుచున్న సెకండ్ గ్రేడ్ టీచర్లకు, తెలుగు, హిందీ లాంగ్వేజ్ పండిట్లకు పదోన్నతి కల్పించడానికి సీనియార్టీ జాబితాను డీఈవో లాగిన్‌లో పొందుపరిచామని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 31వ తేదీ లోపు తెలిపాలని ఆయన సూచించారు.



అనధికార సెల్‌ఫోన్లను పోలీసులకు అందిస్తున్న షాపు నిర్వాహకులు

సెల్‌ఫోన్ షాపులపై పోలీసు దాడులు

ఏలూరు క్రైం, జూలై 24 : నగరంలో సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నా యని వాటిని వెంటనే నగరంలో ఉన్న కొన్ని సెల్‌ఫోన్ షాపులకు విక్రయిస్తున్నట్టుగా జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్‌కు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ సీహెచ్‌వీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు కలిసి సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తున్న ఏలూరు రామచంద్రరావుపేటలో ఉన్న షాపులపై బుధవారం దాడి చేశారు. ఎటువంటి రసీదులు లేని సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లను గుర్తించి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్‌లో సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేశారంటే కచ్చితంగా అమ్మినవారి ఆధార్‌కార్డు, ఫోన్ బిల్లు, బాక్సు వంటి వివరాలు ఉండాలని పోలీసులు తెలిపారు. దొంగ సెల్‌ఫోన్లు కొనుగోలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ దొంగతనం కేసులో ఒకరి అరెస్టు



పట్టుబడిన వారితో భీమవరం పోలీసులు

భీమవరం క్రైం, జూలై 24 : మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరిని అదుపులోకి తీసుకున్నామని భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. భీమవరం డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డి నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని పంపించగా భీమవరం వన్‌టౌన్ యనమదుర్రు మురుగు కాల్వ గట్టు సమీపంలో ఉంటున్న బోను మోజెస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పలు ప్రాంతాలలో బైక్‌లు దొంగతనం చేసినట్టు అంగీకరించారని ఎస్ఐ తెలిపారు. అతడి వద్ద మూడు బైక్‌లు సీజ్ చేసి అతడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ నయీం అస్మి అభినందించారు.

గేదెల కోసం చెరువులో దిగి వృద్ధుడి మృత్యువాత

చింతలపూడి, జూలై 24 : పశువులను మేతకోసం తీసుకువెళ్ళిన వృద్ధుడు కాటూరి వీరయ్య(65) చెరువులో దిగి మృత్యువాత పడిన ఘటన మల్లాయిగూడెంలో బుధవారం జరిగింది. మల్లాయిగూడెంకు చెందిన అతడు రోజువారీగా తన ఇంటి పశువులను మేతకోసం చెరువు సమీపంలోకి తీసుకెళ్లాడు. చెరువులోకి దిగిన పశువులు మరోవైపునకు వెళుతుండగా వాటిని మళ్లించడానికి చెరువులోకి దిగి కొంతదూరం వెళ్లిన తరువాత ప్రమాదవ శాత్తు మునిగిపోయాడని గ్రామస్థులు తెలిపారు. పోలీస్, ఫైర్ అధికారులకు సమాచారం అందించగా చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కుటుంబరావు పరిశీలించారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన.. ఒకరిపై కేసు

టి.నరసాపురం, జూలై 24 : వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ. డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. వివరాలిలా.. వెంకటాపురం గ్రామానికి చెందిన చెలికాని స్వాతి.. బొర్రంపాలెం గ్రామ సెంటర్లో జూలూరి కరుణ షాపును ఒక ఏడాదికి లీజు అగ్రిమెంట్ చేసుకుని సుమారు నాలుగు నెలల నుంచి టీస్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. టీస్టాల్ ప్రదేశంలో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో కరుణ వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పెద్దల్లో పెట్టి మందలించారు. మళ్లీ రెండోసారి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి బెదిరించినట్టు ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉంగుటూరు జూలై 24 : ఉంగుటూరు మండలంలో 24 ఏళ్ల యువతి అదృశ్యమైనట్టు ఆమె తండ్రి కొండేటి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్.ఐ. కె.మణికుమార్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ఈనెల 21 తేదీ రాత్రి అదృశ్యమైందని ఈ విషయమై గ్రామానికి చెందిన సుంకర భాను అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగపాలెం, జూలై 24 : లింగపాలెంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్ఐ పి.చెన్నారావు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మండలంలోని తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నా మని, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కట్నం వేధింపులపై రెండు కేసుల నమోదు

ఉండి జూలై 24: వరకట్న వేధింపులపై వేర్వేరు చోట్ల రెండు కేసులు నమోదు చేశామని ఉండి ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. ఉండి గ్రామానికి చెందిన పులి కనకదుర్గను భర్త రాఘవేంద్ర, అత్త, ఆడపడుచులు అధిక కట్నం తీసుకునిరావాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందన్నారు. 2016లో వారికి వివాహమైందని, అప్పుడు తీసుకున్న కట్నం కాకుండా అధిక కట్నం తీసుకుని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మహదేవపట్నంలో తంగెళ్ల సుశీలను భర్త పెద్దిరాజు, అత్తమామలు అధికకట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. పదమూడేళ్ల క్రితం వివాహమైందని, ఇప్పుడు అధికకట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నా కుమారుడిది హత్యే !

తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు.. అనుమానాస్పద మృతిగా కేసు



విలేకరులతో మాట్లాడుతున్న మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు (ఇన్‌సెట్‌లో) అభినవకుమార్

వేలేరుపాడు, జూలై 24:వేలేరుపాడుకు చెందిన సరిపల్లి అభినవకుమార్ (17) అనుమానస్పదంగా మృతి చెందాడు. దీనిపై యువకుడి తండ్రి వెంకటేశ్వరరావు జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద విలేకరులతో బుధవారం మాట్లాడుతూ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమారుడు ఈనెల 21న స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా స్నేహితుడు మేకల మురళీతో కలిసి జంగారెడ్డిగూడెం మండలం చెల్లావారిగూడెం వెళ్ళినట్లు తెలిసిందన్నారు. మురళీతో మాట్లాడగా శనివారం రాత్రి చెల్లావారిగూడెంలో ఉండి తిరిగి ఇంటికి బయళ్దేరి వచ్చేక్రమంలో కారులో రాజమండ్రి వెళ్లినట్టు తెలిపాడని ఆదివారం, సోమవారం వరకు తన కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఫోన్లో చేయగా వస్తున్నానంటూ చెప్పాడని తెలిపారు. మంగళవారం తన పక్క ఇంట్లో నివాసం ఉంటున్న పత్రా ముత్యాలు తల్లి తమ వద్దకు వచ్చి మీ కుమారుడు రాజమండ్రి నుంచి వస్తూ అస్వస్థతకు గురికావడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని తెలిపారన్నారు. ఆసుపత్రికి వెళ్ళే సరికి కుమారుడు విగతజీవుడై మార్చురీలో పడి ఉన్నాడని వివరించారు. పత్రా ముత్యాలు కుటుంబంతో తమకు గతం నుంచి విభేదాలున్నాయని ముత్యాలు తనకుమారుడిని తీసుకెళ్ళి హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారని రిపోర్టు వస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. ఈ ఘటనపై వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. తన కుమారుడి అనుమానాస్పద మృతి వెనుక గల కారణాలను వెలికి తీసి తమకు న్యాయం చేయాలని కోరారు.


యువతిని మోసగించిన యువకుడికి నాలుగేళ్ల జైలు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, జూలై 24 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని లైంగికంగా వేధించి, ఆమె వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసినట్టు ఓ యువకుడిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు కం ఐదో అదనపు జిల్లా జడ్జి.జి రాజేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం గునుపూడి బ్రిడ్జిపేటకు చెందిన మద్దా ప్రవీణ్‌కుమార్ అలియాస్ నాని అనే యువకుడు భీమవరంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో దగ్గరై ఆమెను పెళ్లి చేసుకుంటానని పలు మార్లు లైంగికంగా వేధించాడు. అనంతరం ఆమె ప్రియుడి అనుమతితో కువైట్ వెళ్ళింది. పెళ్ళి ఖర్చుల నిమిత్తం కువైట్ నుంచి ప్రవీణ్ ఖాతాకు దఫదఫాలుగా రూ.80 వేలు పంపించింది. కువైట్ నుంచి వచ్చిన ఆమె వద్ద నుంచి డబ్బు తీసుకుని పెళ్ళి చేసుకోకుండా కాలయాపన చేస్తున్నాడు. ఈ మేరకు బాధితురాలు 2019 జూన్‌లో భీమవరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ పి.చంద్రశేఖర్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ గోవిందరాజు, సీఐ కృష్ణ భగవాన్ విచారణ చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని మహిళా కోర్టులో విచారణ జరిగి ప్రవీణ్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, ఐదు వేల నగదు జరిమానా విధిస్తూ జి.రాజేశ్వరి తీర్పు చెప్పారు.

తల్లిని గాయపరిచిన కుమారుడిపై కేసు

ఉండి జూలై 24: మద్యం తాగేందుకు డబ్బులు అడిగితే ఇవ్వలేదని కోపంతో తలపై కర్రతో కొట్టి గాయపరిచాడని కుమారుడిపై ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు. ఉండి మండలం చిలుకూరు గ్రామానికి చెందిన ఇండిగపల్లి మరియమ్మను తన కుమారుడు కిశోర్ మద్యం తాగడానికి డబ్బులు అడిగాడని ఆమె ఇవ్వకపోవడంతో కర్రతో తల్లి తలపై కొట్టి గాయపరిచడాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

జ్ఞాన సరస్వతికి శాకంబరీ అలంకరణ



భీమవరంటౌన్, జూలై 24 : ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం గునుపూడి విద్యాగణపతి ఆలయంలో వున్న జ్ఞానసరస్వతీ అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. గునుపూడి ఆడపడుచుల సౌజన్యంతో ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేసి అనంతరం కూరగాయలతో అలంకారం చేశారు. భక్తులు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



చాట్రాయి, జూలై 24: మంకొల్లు పరిధిలో ఉన్న తమ్మిలేరు ప్రాజెక్టు మధ్య తూముకు బుధవారం మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు, రైతులు పూజలు చేసి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు ఆధునీకరణకు 2018లో టీడీపీ ప్రభుత్వం జపాన్ బ్యాంకు నిధులు రూ.18 కోట్లు మంజూరు చేయగా, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అరకొర పనులతో కాలక్షేపం చేసిందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి దీనిపై అధికారులతో మాట్లాడారని, వర్షాలు తగ్గిన తరువాత పనులు పునఃప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



ఆనందరావు(ఫైల్)

యలమంచిలి, జూలై 24: యలమంచిలిలంక గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతైన పితాని ఆనందరావు(43) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. అతడి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గోదావరిలో రెండురోజులుగా గాలింపు చర్యలు చేపట్టిన విషయం విదితమే. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. ఆనందరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

ఉండి జూలై 24: తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి గ్రామానికి చెందిన గెద్దా నిహారిక మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆచూకీ కానరాలేదు. ఈ మేరకు బుధవారం తల్లి శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మండవల్లి, జూలై 24:ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండవల్లి రైల్వేస్టేషన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వే సిబ్బంది అజయ్‌కుమార్ రైల్వేట్రాక్‌పై మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుమారు 2.45 గంటల సమయంలో మండవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది రైల్వేట్రాక్‌పై పడి ఉండడాన్ని గమనించాడు. వెంటనే రైల్వే స్టేషన్ మాస్టర్‌కు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐలు బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎంపీడీవో వెంకటరమణకు ఉద్యోగుల నివాళి



నరసాపురంలో సంతాప సభలో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

నరసాపురం రూరల్, జూలై 24: ఎంపీడీవో వెంకటరమణ మృతికి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఆర్డీవో అంబరీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వివిధ శాఖల ఉద్యోగులు విచ్చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏమైనా సమస్యలు ఉంటే తోటి ఉద్యోగులతో పంచుకోవాలే తప్ప ఇలాంటి నిర్ణయాలు తీసుకోరాదన్నారు. ఎంపీడీవో వెంకటరమణ వంటి మంచి వ్యక్తి ఆత్మహత్య చేసుకుని చనిపోవడం బాధాకరమన్నారు. ఎంపీపీ సోని, జడ్పీటీసీ రాధాకృష్ణ, వీసీ రమేష్‌నాయుడు, తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, ఎంఈవో పుష్పరాజ్యం పాల్గొన్నారు

ఆకివీడు: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ మృతి బాధాకరమని ఆకివీడు ఎంపీడీవో వై.రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం దగ్గర వెంకటరమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూపరింటెండెంట్ శ్రీకర్, సిబ్బంది ఉన్నారు.

భీమవరం రూరల్: భీమవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నర్సాపురం ఎంపీడీవో మృతికి బుధవారం సంతాపం ప్రకటించారు. ఎంపీడీవో వెంకటరామన్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనులో పునుగుపిల్లి



ఆకివీడు, జూలై 24 : ఆకివీడులో పునుగుపిల్లి ప్రత్యక్షమైంది. స్థానిక గంగానమ్మకోడ్ వీధిలో మంగళవారం రాత్రి ఈరి రమేష్ ఎలుకలను నివారించేందుకు ఏర్పాటుచేసిన బోనులో బుధవారం తెల్లవారుజామున చూసే సరికి పెద్దసైజున్న పునుగుపిల్లి పడి ఉంది. దీంతో చుట్టు పక్కల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సంబంధిత అధికారులకు రమేష్ సమాచారం ఇచ్చారు.



భీమవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కేంద్ర బడ్జెట్ పై సీపీఎం నిరసన

భీమవరం అర్బన్/ఆకివీడు, జూలై 24: కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. భీమవరం ఎంఆర్‌ఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ బడా కార్పొరేట్లకు వరాలు ఇచ్చి ప్రజలపై భారాలు వేసిందన్నారు. రాజధాని నిర్మాణానికి సహాయంగా కాకుండా రూ.15వేల కోట్లు అప్పుగా సర్దుబాటు చేస్తామని ప్రకటించడం రాష్ట్రానికి ద్రోహం చేసినట్టే అన్నారు. కార్పొరేట్లకు లాభాలు, పేదలపై భారాలు వేసిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం ఆకివీడు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం గాంధీజీ సెంటర్‌లో దర్నా నిర్వహించి మాట్లాడారు. పేదలకు ఆశాజనకంగా లేదని, ప్రత్యేక హోదా ఊసే లేదని, పునరావాసం కల్పిస్తామని భరోసాగాని ఇవ్వలేదన్నారు.



పర్యావరణాన్ని కాపాడాలి

భీమవరం టౌన్, జూలై 24 : పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత సమాజంలో మనందరిపై ఉందని డీఎన్ఆర్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు అన్నారు. అడవులను విచక్షణారహితంగా నరకడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని అనేక అనర్ధాలకు దారితీస్తుందని డి.యన్.ఆర్. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికల పల్లారావు అన్నారు. బుధవారం తైవాన్ జామ మొక్కలను వాకర్స్‌కు పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు, జాలీవాకర్ అప్పలరాజు, భీమాల శ్రీరామమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

భీమవరం టౌన్, జూలై 24 : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం భగవత్ సేవతో సమానమని జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, పొత్తూరి బాపిరాజు అన్నారు. మెంటేవారితోటలో ముంపు బాధితులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కుమారుడు ప్రశాంత్ సౌజన్యంతో ఆహార పొట్లాలు, పొత్తూరి బాపిరాజు సౌజన్యంతో 200 కంచాలు, గ్లాస్‌లను అందించారు. చెరుకువాడ రంగసాయి, జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, లోవరాజు, మాజీ కౌన్సిలర్లు మెంటే గోపి, ఎద్దు ఏసుపాదం, నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

పాలకొల్లు అర్బన్, జూలై 24 : పట్టణంలోగల మున్సిపల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పట్టణ యూటీఎఫ్ నాయకులు బుధవారం ఎంఈవోలు గంగాధర శర్మ, వీరాస్వామిలకు వినతి పత్రం అందజేశారు.

క్రమశిక్షణతో రూపొందించిన బడ్జెట్ : పాకా

భీమవరం టౌన్, జూలై 24 : రాష్ట్రంలో ప్రజలు కూటమి పార్టీలను విశ్వసించి ఓట్లు వేశారని.. వారి రుణం తీర్చుకోవడానికే కేంద్రం ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేసిందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ పాకా సత్యనారాయణ అన్నారు. బుధవారం పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓట్ల కోసం కాదని, క్రమశిక్షణతో తయారు చేసిన ఆర్థిక బడ్జెట్‌గా ఉందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా దాణా, రొయ్య పిల్లల ధరలు తగ్గించాలి

పాలకొల్లు అర్బన్, జూలై 24 : కేంద్ర బడ్జెట్‌లో ఆక్వా రంగానికి మేలు కలిగే విధంగా ఉందని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో భగవాన్ రాజు మాట్లాడారు. రొయ్య పిల్ల ధరలు, దాణాకు సంబంధించిన పన్నులు తగ్గించడం జరిగిన నేపథ్యంలో వాటి ధరలు తగ్గించాలని భగవాన్ రాజు డిమాండ్ చేశారు. సంఘ ఉపాధ్యక్షులు పెన్మెత్స వెంకట సత్యనారాయణ రాజు, సజ్జా వీరవెంకటసత్యనారాయణ, కోడి విజయభాస్కర్, కార్యదర్శులు బోణం వెంకట నర్సయ్య (చినబాబు), అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

రాజధాని కల సాకారం

తణుకు, జూలై 24:అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించడం ద్వారా రాజధాని కల సాకారం అవుతుందని బీజేపీ నాయకురాలు ముళ్ళపూడి రేణుక హర్షం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో పడకేసిన పోలవరం పనులకు సంపూర్ణ సహకారం అందించేం దుకు కేంద్రం ముందుకు రావడం శుభపరిణామన్నారు. పార్టీ నాయకులు ఐ.శ్రీదేవి, కామర్సు కిరణ్మయి, పెదమల్లు అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లి రైల్వేలైన్ పనులు వేగవంతం చేస్తాం

నరసాపురం టౌన్, జూలై 24: కోటిపల్లి రైల్వేలైన్ పనులను వేగవంతం చేస్తామని, ఇందుకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షులు మునికోటి వెంకటేశ్వరావు, గునిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ పెద్ద వేస్తుందన్నారు. దానికి మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిధుల కేటాయింపులే నిదర్శనమన్నారు. అమరావతికి నిధులతో పాటు పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులోనూ కేంద్రం అండగా ఉంటుందన్నారు.





రామన్నపాలెంలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ అనిల్‌కుమారి.. యండగండిలో మూసుకుపోయిన అండర్‌టన్నెల్‌కు తాత్కాలిక పనులు

వర్షాలు తగ్గినా.. వీడని ముంపు

మొగల్తూరు, జూలై 24: చేలు నీటమునిగిన రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిల్ కుమారి తెలిపారు. మండలంలోని రామన్నపాలెంలో నీట మునిగిన పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో సుమారు 113 ఎకరాల్లో వరి నాట్లు వేయగా వర్షాల కారణంగా 64 ఎకరాలు ముంపునకు గురికాగా 19 ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయన్నారు. మండలంలో 30 ఎకరాల్లో నారుమడులు వేయగా 15 ఎకరాల నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. ముంపు చేలల్లో నీరు లాగిన అనంతరం ఎకరానికి 15 కిలోల యూరియా, 20కిలోల పొటాష్‌లను వినియోగించాలన్నారు. కోర్సోనిజమ్, మ్యూన్‌కోజాబ్ 2 గ్రాముల మందును లీటర్‌నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



ఆకివీడులో ఆందోళన చేస్తున్న తాళ్ళకోడు జగనన్న కాలనీ వాసులు

టన్నెల్ వద్ద పనులు

ఉండి జూలై 24: యండగండి సంతమార్కెట్‌లో నుంచి మురుగునీరు బయటకు పోవడానికి అండర్‌టన్నెల్ మూసుకుపోయింది. దీనితో నీరు నిలిచిపోయింది. అండర్‌టన్నెల్‌ను తెరిపించడానికి యంత్రాలతో పనులు చేస్తున్నారు. యండగండి లాకుల వద్ద పంటకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ముందు జాగ్రత్తగా ఇసుక బస్తాలను అధికారులు సిద్ధంగా వుంచారు.

జగనన్న కాలనీవాసుల ధర్నా

ఆకివీడు, జూలై 24 : తాళ్ళకోడు ఇళ్ళ స్థలాల కాలనీని స్థానిక నగర పంచాయతీకి అనుసంధానం చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులివ్వాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బీవీ వర్మ డిమాండ్ చేశారు. బుధవారం తాళ్ళకోడు జగనన్న కాలనీలో నివాసితులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. తాళ్ళకోడు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆకివీడు మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. వర్షాలకు కాలనీ మునిగిపోయిందన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

భీమవరం టౌన్, జూలై 24 : వ్యక్తిగత సమాచారాలను ఎవ రితో పంచుకోవద్దని, మిమ్మల్ని వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్ లైన్ వేధింపులకు గురి చేస్తుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. టూ టౌన్ సీఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మోసపూరిత రుణయాప్‌ల నుంచి సురక్షితంగా ఉండాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెంటే హరినాథ్‌బాబు, వన్ టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం

భీమవరం క్రైం, జూలై 24 : మానసిక దివ్యాంగులకు న్యాయసేవా సంస్థ అండగా ఉంటుందని న్యాయ సహాయం అవసరమైన వారు ఉచిత న్యాయవాదులను సంప్రదించవచ్చని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్ అన్నారు. భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉండి రోడ్డులో ఉన్న భవిత మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మానసిక వికలాంగుల యోగక్షేమాల గురించి వారి విద్యా వికాసం గురించి సంస్థ ప్రధానోపాధ్యాయురాలు కె బేబీ కుమారిని అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి కోల్పోయిన యానాదులను ఆదుకోవాలి

పాలకోడేరు, జూలై 24: భారీ వర్షాలు, వరదల వలన ఉపాధి కోల్పోయిన యానాదులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తులవారిపాలెం సమీపంలో ఉన్న యానాదుల కాలనీలో సీపీఎం ప్రతినిధి బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కుంటున్న అనేక సమస్యలను సీపీఎం ప్రతినిధి బృందం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతీ ఏడాది వర్షాలు వరదల వలన తమ ఇంటి పరిసరాలతో పాటు గృహాల్లో కూడా వరదనీరు వచ్చేస్తుందని తెలిపారు. ఏ ఒకరోజు పనికి వెళ్తే తప్ప పూటగడవని పరిస్థితి తమదని వాపోయారు.

హెచ్ఐవీపై అవగాహన



అత్తిలి, జూలై 24 : హెచ్ఐవీ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని డాక్టర్ నాగరాజు అన్నారు. కృష్ణా యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో అడ్వకసీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఎయిడ్స్ చట్టం 2017 గురించి అవగాహన కల్పించారు. టీబీ సూపర్‌వైజర్ గిరిబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ, టీబీ రెండూ సహ సంక్రమణ వ్యాధులని, ఎవరికైనా రెండు వారాలకి మించి దగ్గు వస్తుంటే దగ్గరలోని ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ కె.నాగరాజు, సీహెచ్‌వో మురళీ, హెల్త్ డైరెక్టర్ పి.ప్రమీలాదేవి, హెచ్‌వీ అమ్మాజీ, టీబీ జనరల్ సూపర్ వైజర్ గిరిబాబు, ప్రాజెక్టు మేనేజర్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్, జూలై 24 : పుట్టిన ప్రతీ బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు అందించేలా చూడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. పట్టణంలోని కొత్తపేట అర్బన్‌హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలు నమోదు, రిజిస్టర్, ఎంఆర్1 ఎంఆర్ 2 వివరాలపై ప్రశ్నించారు.

కౌలు రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలి

గణపవరం, జూలై 23 : కౌలు రైతుల ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ బకాయిలు తక్షణం విడుదల చేయాలని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు నిరసన చేశారు. కేశవరం గ్రామ సచివాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులకు వస్త్రాల పంపిణీ

గణపవరం, జూలై 24: కుష్ఠువ్యాధి అంటు వ్యాధి కాదని వారి పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. బుధవారం కాశీపాడులో నిర్వహించిన కుష్ఠువ్యాధిపై ఇంటింటా సర్వే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెనుమత్స సుబ్బరాజు కుష్ఠువ్యాధి గ్రస్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. ప్రభుత్వ వైద్యాధికారి సంతోష్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావో

అత్తిలి, జూలై 24: పాలి జడ్పీ హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు సమాచారాన్ని ఐసీడీఎస్ కార్యాలయాలకు సమీప అంగన్‌వాడీ కేంద్రానికి ఇవ్వాలని సూపర్‌వైజర్ కె కుమారి తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్త్ సిబ్బంది, మహిళా పోలీస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లలకోడేరులో డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం



తవ్వకం పనులు పర్యవేక్షిస్తున్న నాయకులు

పాలకోడేరు, జూలై 24: గొల్లలకోడేరు గ్రామంలో ఏళ్ళ నాటి డ్రెయినేజీ సమస్య పరిష్కారాని కి గ్రామ టీడీపీ నాయకులు పరిష్కారం చూపారు. గ్రామంలో చిన్నపాటి వర్షం వచ్చినా గ్రామంలోని అనేక కాలనీలు ముంపు బారినపడుతు న్నాయి. దీంతో గ్రామ టీడీపీ నాయకుడు కమ్మిలి రాంబాబు, బీసీ టీడీపీ నాయకుడు కామన రాంబాబు, ఎస్టీ నాయకుడు సాలా మల్లేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, సంబలదీవి వెంకటేశ్వరరావు, జుత్తిగ శ్రీను, తదితరులు సమస్యను పరిష్కరించే విధంగా గ్రామస్థులతో మాట్లాడి ఆక్రమణలు తొలగించే పనికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారి వెంబడి ఇరిగేషన్ బోదెను ఆక్రమించుకున్న వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. 2కిలోమీటర్ల మేర బోదె తవ్వకం పనులకు మోక్షం కలిగే విధంగా చర్యలు చేపట్టడంతో ఏళ్ళ నాటి సమస్యకు పరిష్కారం లభించిందంటూ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

పాలకొల్లు అర్బన్, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గి పోతున్న ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడం లో స్థానిక పెద్దల సహకారం తీసుకోవా లని కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. బీఆర్ఎంవీఎంహైస్కూల్లో జరుగుతున్న టచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను నాగమణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ట్రైనింగ్‌కు హాజరు అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్యను వారి పనితీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఈవో జీ వీరాస్వామి, మాస్టర్ ట్రైనర్లను అభినందించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఫిబ్రవరి, మార్చి నెలల్లో పాఠశాల పరిసర ప్రాంతాల్లో పర్యటించి, ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్‌ను చేయడం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే అవకాశం ఉంటుందన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న జడ్పీటీసీ ఉప్పలపాటి, కూటమి నాయకులు

ఆచంట, జూలై 24: మధ్యాహ్న భోజన పథకం విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు లేకుండా నాణ్యత లోపాలు లేకుండా శుభ్రమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. బుధవారం ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జడ్పీటీసీ, కూటమి శ్రేణులు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొక్కా సుబ్రహ్మణ్యం, చిలుకూరి సీతారామ్, నెక్కంటి ప్రభాకర్, దబ్బా ప్రకాష్, ఎంఈవో ఉషారాణి ఉన్నారు.

పేదలకు జనసేన పార్టీ అండ



ఇన్సూరెన్స్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 24 : పేదలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన నాయకులు ఇరువురికి రూ96,600 జనసేన సభ్యత్వ ఇన్సూరెన్స్ చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, మండల అధ్యక్షుడు మోకా శ్రీను, తొలేరు సర్పంచ్ వెంకట కృష్ణ పాల్గొన్నారు

కాటన్ చిరస్మరణీయుడు

పెనుమంట్ర/ఆచంట, జూలై 24:సర్ ఆర్థర్ కాటన్ దొర చిరస్మరణీయుడని ఇరిగేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుబ్బల జయ శంకర్ అన్నారు. బుధవారం మార్టేరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆయన వర్ధంతి నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పిం చారు. కొడమంచిలిలో కాటన్ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన రైతాంగానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకట రమణయ్య జయంతి

పాలకొల్లు అర్బన్, జూలై 24 :స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారిణి వి శాంత కుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసందర్భంగా వెంకట రమణయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

పెంటపాడు, జూలై 24 : మండలంలోని సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ తెలిపారు. ప్రతిఒక్కరూ సచివాలయాలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటు

మొగల్తూరు, జూలై 24: ఆధార్ కార్డుల్లో తప్పులు సవరించుకునేందుకు మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. మొగల్తూరు పంచాయతీ 3వ గ్రామ సచివాలయ పరిధిలోనూ, రామన్నపాలెం, ముత్యాలపల్లి, కెపిపాలెం సచివాలయాల్లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



కొఠాలపర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాల్య వివాహాలు చేయవద్దు

పెనుగొండ, జూలై 24: చిన్నతనంలో వివాహాలు చేయకూడదని అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ. కృష్ణకుమారి అన్నారు. కొఠాలపర్రు గ్రామపంచాయతీ వద్ద ఆధార్‌కార్డు మొబైల్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ అవగాహనర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎం. విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉండి: బాల్యవివాహాలు జరుగకుండా చూడలవలసిన బాధ్యత అందరిపై వుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. బుధవారం మహదేవపట్నం హైస్కూల్ వద్ద పీఎం మిషన్ కార్యక్రమం జరిగింది. నిర్మల మాట్లాడుతూ బాల్యవివాహలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహలను అడ్డుకోవాలన్నారు.

స్థలం ఆక్రమించారంటూ సీఎంకు ఫిర్యాదు

ఆచంట, జూలై 24: ఆచంట శివారు వంకతాళ్ళచెరువుకు చెందిన పిల్లి పార్వతి తన భూమిని వైసీపీలోని తమ బంధువులు ఆక్రమించుకొన్నారని తనకు తిరిగి ఇప్పించాలని ఇటీవల బాధితురాలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వినతిపత్రాన్ని అందించింది.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న పొత్తూరి

నరసాపురం టౌన్, జూలై 24: పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంగా ఉందంటే దానికి కార్యకర్తలే కారణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అంతకు ముందు ఆత్మహత్య చేసుకున్న ఎంపీడీవో వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గంధం రామకృష్ణకు నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

వైఎన్ కళాశాల ఐక్యూ కో ఆర్డినేటర్‌గా గంధం

నరసాపురం, జూలై 24: వైఎన్ కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్‌గా గంధం రామకృష్ణను నియమిస్తూ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి నియమాక పత్రాన్ని బుధవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ అందే రామకృష్ణ అందించారు. ప్రస్తుతం రామకృష్ణ కళాశాల డీన్‌గా వ్యవహరిస్తున్నారు. అదనపు బాధ్యతలు చేపట్టిన ఆయన్ను కళాశాల సిబ్బంది అభినందించారు.

వైసీపీ నిర్లక్ష్యం వల్లే ముంపు

నరసాపురం రూరల్; జూలై 24: నరసాపురం తీర ప్రాంతంలో వందలాది ఎకరాలు ముంపునకు గురికావడానికి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట గంగరాజు ఆరోపించారు. బుధవారం వేములదీవి, బియ్యపుతిప్ప, చామకూరిపాలెం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వం స్లూయిస్‌లను నిర్లక్ష్యం చేసిందన్నారు. డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడం వల్ల ఇరిగేషన్ అస్థవ్యస్థంగా మారిందన్నారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

పిల్లలున్నచోటకే అంగన్‌వాడీ కేంద్రాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24: పిల్లలు ఉన్న ప్రాంతాలకు అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తాడేపల్లిగూడెం సీడీపీవో టీఎల్ సరస్వతి తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా సర్వే చేసిన అనంతరం ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు దుర్గాభవాణి, ఎస్తేరు, విశాలాక్షి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ తీసుకోవాలి

పెంటపాడు, జూలై 24 : విద్యార్థులందరూ ఎన్‌సీసీలో శిక్షణ తీసుకోవాలని టీబీఆర్ సైనిక్ స్కూల్ అధినేత తనుబుద్ది బోగేశ్వరరావు అన్నారు. ఎన్‌సీసీ జాతీయ క్యాంపు (కేరళ ట్రెక్ ట్రైనింగ్)కు ఎంపికైన అలంపురం టీబీఆర్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని ముత్యాల కావ్యశ్రీని అభినందించారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, హెచ్ఎం కళ్యాణి, ఏవో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు శిక్షణ

పెంటపాడు, జూలై 24: ప్రకృతి వ్యవసాయం వల్ల ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. తాడేపల్లిగూడెం, అలంపురం గ్రామాలలో బుధవారం క్షేత్రస్థాయి ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీపై శిక్షణ ఇచ్చారు. తాడేపల్లిగూడెం డివిజన్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పెనుగొండ, జూలై 24: సిద్దాంతం గ్రామానికి చెందిన యువతి ఈ నెల 23 ఉదయం నుంచి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పెనుగొండ ఎస్ఐ సీహెచ్ సుభాని తెలిపారు. బుధవారం రాత్రి మాట్లాడుతూ యువతి తల్లి దార్లంక విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సమాచారం

స్కిల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

నరసాపురం రూరల్, జూలై 24: మండలంలోని పీఎంలంక గ్రామంలోని స్కిల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు సెంటర్ సహాయ సంచాలకులు ఎం వసంతరావు తెలిపారు. ప్రస్తుతం మూడు కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఫోర్‌మేన్ ఎలక్ట్రిషన్, సోలార్ పేనల్ ఇన్స్టాలేషన్, అప్లికేషన్ డవలప్‌మెంట్, వెబ్ అండ్ మొబైల్స్ వంటి కోర్సులు ఉన్నాయన్నారు. పది, ఐటీఐ, డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 91105 77979 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రేపు జాబ్ మేళా

ఉండి జూలై 24 : దివ్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టరు దుర్గారావు వెల్లడించారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధుల సమక్షంలోనే పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇండిగో, డిక్సన్, ఐసీఐసీఐ బ్యాంక్, అరబిందో, అపోలో(ఫార్మసీ), స్పందన, హ్యుండాయ్, రాక్‌మాన్ తదితర కంపెనీలు హాజరవుతాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎం ఫార్మసీ విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ కంపెనీలలో 870 ఖాళీలు వున్నట్లు తెలిపారు. వివరాలకు 99083 57835 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, జూలై 24 : విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యనమదుర్రు, కట్టావారిపాలెం, దిరుసుమర్రు హైస్కూల్ సెంటర్, సంతోషపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

నేటి నుంచి ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణలు

పాలకొల్లు అర్బన్, జూలై 24 : ఎంఆర్‌పీఎస్ జెండాలను గురువారం నుంచి గ్రామ గ్రామానా ఆవిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చినబాబు అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో బుధవారం జరిగిన నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ కార్యవర్గ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శరత్ అధ్యక్షతన జరిగింది.